సాక్షి
వైఎస్సార్ జిల్లా

సోమవారం । 8 । ఏప్రిల్ । 2024



వైఎస్సార్‌సీలోకి చేరికలు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. వివిధ నియోజకవర్గాల్లో ఆయా నాయకుల సమక్షంలో పలువురు పార్టీలో చేరారు. -IIలో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమ (సా॥)	సహర్ మంగళ (ఉ॥)
కడప	: 6.31	4.52
పులివెందుల	: 6.34	4.47
ప్రొద్దుటూరు	: 6.33	4.56

గరిష్టం/కనిష్టం
42.8/25.2


వాతావరణం

జిల్లాలో ఆదివారం 25.2 – 42.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

వాసు ఇక ఏకాకి!

- టీడీపీకి దూరమవుతున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి
- సోదరుడి భవిష్యత్ పట్ల చొరవ చూపని శ్రీనివాసులరెడ్డి
- టీడీపీ నియోజకవర్గాల ఇన్‌చార్జీలతో కూడా విభేదాలు
- ఇంటా బయటా ఒంటరిగా మిలిగిన పొలిట్‌బ్యూరో సభ్యుడు



సాక్షి ప్రతినిధి, కడప: ఇంట గెలిచి రచ్చ గెలవమన్నారు పెద్దలు. అయితే ఆయనకు తద్భిన్నమైన పరిస్థితి నెలకొంది. సొంతం అనుకున్నవారి మద్దతు కోల్పోయారు. ప్రజాక్షేత్రంలో తీర్పు కోసం తాపత్రయపడుతున్నారు. ప్రజామెప్పుతో అటు దిశగా ప్రయాణిస్తారని భావిస్తే తప్పులో కాలేసిన ట్లే.చీప్ 'ట్రిక్స్' ఆధారంగా సోషల్ మీడియా కేంద్రంగా రెచ్చగొట్టి లబ్ధి పొందాలనే దిశగా అడుగులు వేస్తున్నారు. చిత్తశుద్ధి లేకపోవడంతో ఏకాకిగా మిగిలిపోయారు.

- రెడ్డెప్పగారి శ్రీనివాసుల రెడ్డి తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు. కడప పార్లమెంట్ పార్టీ అధ్యక్షుడు. ఇప్పుడు ఆ కుటుంబంలో వాసు ఒక్కడు ఒకవైపు మిగిలారు. సోదరుడు, మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి తెలుగుదేశం పార్టీకి దూరమయ్యారు. కష్టపడి పార్టీ కోసం పనిచేసినా ఎమ్మెల్యే టికెట్ అప్పగించేందుకు చంద్రబాబు నిరాకరించడం, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయడంతో రమేష్‌రెడ్డి టీడీపీకి దూరంగా ఉన్నారు. మరోవైపు వైఎస్సార్‌సీపీ విజయం కోసం కృషి చేయాలని, ఆ పార్టీకి రమేష్‌కుమార్‌రెడ్డి సేవలు వినియోగించుకునేందుకు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ముందడుగు వేశారు. శనివారం రాత్రి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డితో కలిసి ప్రత్యేక సమావేశమయ్యారు. ఈ చర్చలు అనంతరం రమేష్‌కుమార్‌రెడ్డి సైతం సానుకూలత వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రత్యక్షంగా వైఎస్సార్‌సీపీలో చేరేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

ఇప్పటికే వైఎస్సార్‌సీపీలో చేరిన సతీష్‌కుమార్‌రెడ్డి....

టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి మేనమామ కుమారుడు పులివెందుల టీడీపీ అభ్యర్థిగా 5సార్లు పోటీ చేసిన ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి ఇదివరకే వైఎస్సార్‌సీపీలో చేరిన విషయం పాఠకులకు తెలిసిందే. ఎన్నికల్లో ఓడిపోతానని తెలిసి కూడా పోటీ చేస్తూ, చిత్తశుద్ధితో టీడీపీ ఉన్నతి కోసం కృషి చేసిన సతీష్‌కుమార్‌రెడ్డి సైతం ఇమడ లేకపోయారు. కారణం ఛీత్కారాలు ఓవైపు, అనుమానపు చూపులు మరోవైపు, పైరవీకారుల పెత్తనం ఇంకో వైపు ఉండడమేనని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. రక్త సంబంధీకులు టీడీపీకి దూరమవుతున్నా, శ్రీనివాసులరెడ్డి కొనసాగడం వెనుక చంద్రబాబు ఆలోచన ధోరణికి అనువుగా వాసు ఆలోచనలు ఉండడమేనని పలువురు వెల్లడిస్తున్నారు. కడప అసెంబ్లీ సీటు తన సతీమణి మాధవీరెడ్డికి ఇప్పించుకోవడంలో సఫలమైన వాసు, సమీప బంధువుల మనస్సు మెప్పించడంలో విఫలమయ్యారని పరిశీలకులు భావిస్తున్నారు.



రమేష్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి (ఫైల్)

▶▶ పార్లమెంట్‌పరిధిలోనూ అదే ధోరణి

సొంత బంధువులతోనే కాదు, పార్లమెంట్ పరిధిలోని పార్టీ నాయకులతో కూడా శ్రీనివాసులరెడ్డితో సఖ్యత కన్పించడం లేదని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. కమలాపురం, మైదుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జీలతో ఉప్పు–నిప్పులా కొనసాగుతున్నట్లు సమాచారం. బద్వేల్, ప్రొద్దుటూరు, జమ్మలమడుల్లో అదే పరిస్థితి. ఈయన చర్యల కారణంగానే టికెట్ కోల్పోయామనే భావన ఆయా ఇన్‌చార్జీల్లో లేకపోలేదు. పులివెందుల అభ్యర్థి బీటెక్ రవి మాత్రమే వాసుతో అనుకూలంగా ఉన్నట్లు సమాచారం. అదీ కూడా ఆర్థిక సంబంధాలే అనుకూలంగా మార్చాయని పలువురు చెప్పుకొస్తున్నారు.అటు ఇంట్లో, ఇటు పార్టీలో అందరినీ దూరం చేసుకున్న శ్రీనివాసులరెడ్డి కడప అసెంబ్లీకి మాత్రమే పరిమితం అయ్యారు. కడపలో టీడీపీ శ్రేణులందరితో కలుపుగోలుగా వెళ్లారా...అంటే అదీ లేదు. భవిష్యత్‌లో కూడా కడప టీడీపీలో ఎలాంటి ఎదురు లేకుండా ఉండాలనే దిశగా అడుగులు వేస్తున్నట్లు విశ్లేషకులు చెప్పుకొస్తుండడం గమనార్హం.

అవే వాహనాలు.. అదే ప్రజలు





కమలాపురం నియోజకవర్గంలో జరిగిన షర్మిల మీటింగులకు కడప నుంచి జనాన్ని తరలించిన వాహనాలు (ఇన్‌సెట్) మాట్లాడుతున్న షర్మిల

- కమలాపురం నియోజకవర్గంలోనూ షర్మిల రోడ్‌షో అట్టర్ ఫ్లాప్
- 10 మీటింగుల్లో జనం లేక 7 రద్దు

కమలాపురం/వల్లూరు: ఏపీసీసీ అధ్యక్షురాలి హోదాలో కడప పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేస్తున్న షర్మిల కమలాపురం నియోజకవర్గంలో ఆదివారం జరిగిన ప్రచార కార్యక్రమానికి కడప నుంచి దాదాపు 40 ప్రత్యేక వాహనాల్లో (తుఫాన్) అక్కడి నుంచే ప్రజలను తీసుకువచ్చారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలకు అవే వాహనాల్లో కడప నుంచి వచ్చిన ప్రజలనే తరలించారు. రాత్రి 8 గంటలవుతున్నా ఇంకా ఇదేమి ప్రచారం అని కడప నుంచి వచ్చిన మహిళలు అసహనం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని చింతకొమ్మదిన్నె మండలంలో ఉదయం ప్రారంభమైన ఆమె ప్రచారం రాత్రి చెన్నూరు మండలంలో ముగిసింది. పీసీసీ అధ్యక్షురాలిగా ఆమె కమలాపురం నియోజకవర్గంలో మొదటి సారిగా ఎన్నికల ప్రచారానికి రాగా ప్రజాదరణ కనిపించలేదు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత, మాజీ రాజ్యసభ సభ్యుడు తులసిరెడ్డి, సీపీఐ రాష్ట్ర నాయకుడు ఓబులేసు, ఇండియా కూటమి కమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థి గాలి చంద్రలతో కలసి ప్రచారానికి వచ్చిన షర్మిలకు ఏ ఒక్క మండలంలో ప్రజలు ఆదరించక పోవడంతో షెడ్యూల్‌లో ఉన్న సమావేశాలను వరుసగా ఆమె రద్దు చేసుకోవాల్సి వచ్చింది. షెడ్యూల్ మేరకు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం 10 మీటింగుల్లో ఆమె మాట్లాడాల్సి ఉండగా జనం లేక 7 మీటింగులను రద్దు చేసుకున్నారు. ఉదయం చింతకొమ్మదిన్నె మండలం మూలవంక, చింతకొమ్మదిన్నె హెడ్ క్వార్టర్, అలాగే పెండ్లిమర్రి మండలం ఎల్లటూరు, పెండ్లిమర్రి హెడ్‌క్వార్టర్‌లో జరగాల్సిన కార్నర్ మీటింగులను కేవలం ప్రజలు లేకనే రద్దు చేసుకున్నారు. పెండ్లిమర్రి మండలంలోని నంది మండలంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జనం నుంచి స్పందన కనిపించకపోవడంతో వీఎన్ పల్లె మండలంలోని తంగేడుపల్లె వద్ద నుంచి మధ్యాహ్నం భోజన విరామం తర్వాత చాలా ఆలస్యంగా ఆమె తిరిగి బయలుదేరారు. వీఎన్ పల్లె మండలం హెడ్ క్వార్టర్‌లో, కమలాపురం మండలం పెద్దచెప్పలిలో సైతం షర్మిల తన సమావేశాలను జన స్పందన లేకపోవడంతో రద్దు చేసుకోవాల్సి వచ్చింది. కాగా కమలాపురం క్రాస్ రోడ్డులో జరగాల్సిన సభను ప్రజలు లేక పోవడంతో కమలాపురం టౌన్‌లోని చౌక్‌లో నిర్వహించారు. ప్రజలు లేక పోవడంతో వల్లూరులో జరగాల్సిన సమావేశాన్ని సైతం రద్దు చేసుకోవాల్సి వచ్చింది. ఆమె గన్‌మెన్ కుటుంబ సభ్యుల కోరిక మేరకు వల్లూరులోని వారి ఇంటికి వెళ్లి తేనీరు సేవించి తిరిగి బయలు దేరి వెళ్లారు. చెన్నూరు కొత్త రోడ్డులో సభ నిర్వహించారు. కాగా షెడ్యూల్‌లో లేని పెండ్లిమర్రి మండలం యాదవాపురానికి వెళ్లి ఇటీవల హత్యకు గురైన శ్రీనివాసులు కుటుంబాన్ని ఆమె పరామర్శించారు. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి బిడ్డ షర్మి ల సభలకు జనాదరణ లేకపోవడాన్ని చూసిన వారు నిట్టూరుస్తున్నారు.రాజన్నకు మించిన పాలన అందిస్తున్న జగన్‌ను విమర్శించడాన్ని ప్రజలు జీర్ణించుకోవడం లేదని, అందుకే ఆమె సమావేశాలకు ప్రజా స్పందన కనిపించడం లేదని ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు.

న్యూస్‌రీల్

నేటితో ముగియనున్న పది మూల్యాంకనం

కడప ఎడ్యుకేషన్: కడప మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో నిర్వహిస్తున్న పదో తరగతి సమాధాన పత్రాల మూల్యాంకనం సోమవారం ముగియనుంది. ఇందులో భాగంగా ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి వచ్చిన 1,96,635 సమాధాన పత్రాలకు 24,894 పత్రాలకు మూల్యాంకనం జరిగిందని డీఈఓ, క్యాంపు అధికారి మర్రెడ్డి అనురాధ తెలిపారు. మూల్యాంకన కేంద్రంలో సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతులను కల్పించామని ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ వెంకటేష్ తెలిపారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘన



బి.మఠం మండలం ముదుమాల గ్రామంలో పుట్టా పేరుతో గోడలపై రాతలు

బ్రహ్మంగారిమఠం: మండలంలోని ముదుమాల గ్రామంలో నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ పేరుతో గ్రామంలో గోడలపై రాసిన రాతలు చెరిపేయలేదు. ఎన్నికల నియమావళి గురించి ఇక్కడి సిబ్బంది పట్టించుకోలేదు. ఎన్నికల నియమావళి ప్రకారం ఎక్కడా రాజకీయనాయకులకు చెందిన విగ్రహాలు, గోడలపై రాతలు, వాల్‌పోస్టర్లు ఉండకూడదు.

అవాస్తవాలు ప్రచారం చేసే వారిపై నిఘా

కడప అర్బన్: సోషల్ మీడియాలో అవాస్తవాలు ప్రచారం చేస్తూ శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై కఠినచర్యలు తీసుకుంటామనీ కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తల మధ్య విద్వేషాలు రగిల్చే విధంగా సోషల్ మీడియా వేదికగా మాట్లాడుతూ, శాంతి భద్రతలకు భంగం కలిగించేలా పోస్టులు పెట్టేవారిపై సైబర్ సోషల్ మీడియా విభాగం నిఘా ఉంటుందన్నారు. సదరు చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. అవాస్తవ ప్రచారాన్ని ప్రజలు ఎవ్వరూ నమ్మవద్దని డీఎస్పీ సూచించారు. ఫేక్ న్యూస్ వ్యాప్తి లేదా ఫార్వర్డ్ చేసే వారిపై నిఘా ఉంచామన్నారు. నిజానిజాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో పోస్ట్ చేసేవారిపై, షేర్ చేసే వారిపై, సంబంధిత గ్రూప్ అడ్మిన్‌లపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కడపలో సాయుధ బలగాలతో 'ఫ్లాగ్‌మార్చ్'

కడప అర్బన్: నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోండి.. మీ వెంట మేమున్నాం.. అంటూ కడప నగరం చిన్నచౌక్ సీఐ పి. నరసింహారెడ్డి, ఎస్ఐ పి. రవికుమార్, సిబ్బందితో ప్రజలకు భరోసా కల్పించారు. జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ పర్యవేక్షణలో చిన్నచౌక్ సీఐ నరసింహారెడ్డి, ఎస్ఐ రవికుమార్‌లు పోలీసు సిబ్బంది ఆదివారం రాత్రి 'సశస్త్ర సీమాబల్' కేంద్ర సాయుధ బలగాలతో 'ఫ్లాగ్ మార్చ్'ను నిర్వహించారు. చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత బైపాస్, అశోక్‌నగర్, నెహ్రూనగర్, అప్సర సర్కిల్, ఎన్జీఓ కాలనీ, వై–జంక్షన్ ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ చేస్తూ ప్రజలకు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని భరోసా కల్పించారు. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే తమ లక్ష్యమన్నారు.

కడపరాయుడి సేవలో ఆర్‌టీఐ కమిషనర్



దేవునికడపలో ఆలయంలో చెన్నారెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్: దేవునికడపలోని శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ఆర్‌టీఐ కమిషనర్ చెన్నారెడ్డి కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు అర్చకులు ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారిని దర్శింపజేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మనోజ్, కడప మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, దేవానందకుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రామయ్యసేవలో..

ఒంటిమిట్ట: ఒంటిమిట్టలోని కోదండరామయ్యను ఆదివారం రాష్ట్ర సమాచార కమిషనర్ కాకర్ల చెన్నారెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అర్చకులు వారికి స్వాగతం పలికారు.

జగనన్న ఆర్యవైశ్యులకు రాజకీయప్రాధాన్యత ఇచ్చారు



మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

ఆర్యవైశ్యుల ఆత్మీయ సభలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

ప్రొద్దుటూరు: జగనన్న ప్రభుత్వంలో ఆర్యవైశ్యులకు అన్ని విధాలా ప్రాధాన్యత కల్పించామని కడప లోక్‌సభ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక శ్రీవాసవి కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి ఆర్యవైశ్యుల ఆత్మీయ సభను నిర్వహించారు. టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు సభకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కోలగట్ల వీరభద్రస్వామి, వెలంపల్లి శ్రీనివాస్, అన్నా రాంబాబులు ఎమ్మెల్యేలుగా రాణించారన్నారు. ఏ పార్టీలో ఇంతటి సామాజిక న్యాయం చేయరని తెలిపారు. గతంలో రెండు మార్లు ప్రొద్దుటూరుకు టీటీడీ బోర్డు మెంబర్లుగా చిప్పగిరి ప్రసాద్, టంగుటూరు మారుతిప్రసాద్‌లను నియమించామన్నారు. జగనన్న ప్రభుత్వం వస్తూనే మళ్లీ ప్రొద్దుటూరు ఆర్యవైశ్యులనే టీటీడీ పాలకమండలి సభ్యులుగా స్థానం కల్పిస్తామన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఆర్యవైశ్యులకు సంబంధించిన ఆలయాలు, అన్నదాన సత్రాలపై హక్కు వారికే కల్పించేలా జీఓ జారీ చేశారన్నారు. ఆయన మరణంతో జీఓ సరిగా అమలు కాలేదని, మళ్లీ ప్రభుత్వం వచ్చాక జీఓను పునరుద్ధరించి అమలు చేస్తామన్నారు.

వరద చర్యలతో ఆర్యవైశ్యులు ఇబ్బందులు పడ్డారు:ఎమ్మెల్యే

వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ పాతికేళ్ల ఎమ్మెల్యేగా ఉన్న టీడీపీ అభ్యర్థి వరదరాజులరెడ్డి హయాంలో ఆర్యవైశ్యులు ఇబ్బంది పడ్డారని తెలిపారు. డబుల్ ధమాక పేరుతో 20 ఏళ్ల క్రితం చేసిన అప్పులను నేటికీ ఆర్యవైశ్యులకు చెల్లించలేదన్నారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కామిశెట్టి సుబ్బారావు పేరును షాపింగ్ కాంప్లెక్స్‌కు పెట్టకుండా చేశారన్నారు. ఎస్ఎస్ మాల్ నిర్మాణానికి సంబంధించి ఆర్యవైశ్యులను ముందు పెట్టి వరదరాజులరెడ్డి కుమారుడు కొండారెడ్డి వ్యాపారం చేశారన్నారు. ఇక్కడి డబ్బు తీసుకెళ్లి మరోచోట పెట్టారని తెలిపారు. చాలా మంది ఆర్యవైశ్యులు ఈ కారణంగానే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పరిస్థితి ఆత్మహత్యలు చేసుకునే వరకు వచ్చిందని చెప్పారు. శివాలయం మూత పడటానికి వరదరాజులరెడ్డి కారణమన్నారు. తన వల్ల ఆర్యవైశ్యులు ఇబ్బంది పడ్డారని చెబితే ఎన్నికల్లో నామినేషన్ వేయనని ఎంపీ ఎదుటే స్వయంగా చెబుతున్నానన్నారు. ఇదే మాటను సభ నిర్వహించి వరదరాజులరెడ్డి ధైర్యంగా చెప్పగలడా అని ప్రశ్నించారు. ఏనాడు తాను ఆర్యవైశ్యుల నుంచి చందాలు తీసుకోలేదని, వారు ఓటేస్తే చాలు అని భావించానన్నారు. ప్రొద్దుటూరు పశువైద్య కళాశాలకు 83 ఎకరాల స్థలం దానం చేసిన నారాయణ రంగయ్యగారి కుటుంబీకుల పేరు పెట్టి విగ్రహం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

- చిల్లర అంగళ్లలో గంజాయి అమ్ముతారని చంద్రబాబు మాట్లాడిన మాటల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా ఆర్యవైశ్యులు మనస్తాపం చెందారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. వరదరాజులరెడ్డి హయంలో, తన హయాంలో జరిగిన అభివృద్ధిని పోల్చుకోవాలని తెలిపారు. పట్టణ ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు ఎక్కువగా ఉన్న వార్డులను పునర్విభజన చేస్తే ఆర్యవైశ్యులే అక్కడ పోటీ చేస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు మిట్టా కరుణాకర్, పులివెందుల పట్టణ ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు కొత్త రవికుమార్, స్థానిక ఆర్యవైశ్య ప్రముఖుల మహేష్, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు మారుతిప్రసాద్, వల్లంకొండు మనోహర్, కొప్పర్తి మధుసూదన్, సీవీ సురేష్, గాజుపల్లి అభినయ్, కాకుమాని సుబ్బారావు, నాగెళ్ల శ్రీనివాసులు, కాసంశెట్టి సుధాకర్, దొంతు ఓబులేసు, మేడా మధు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఆర్యవైశ్యులు

రామదర్శనం.. ముక్తిదాయకం

11 నుంచి పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వాల్మీకిపురం: వాల్మీకిపురంలో వెలసిన పట్టాభిరామస్వామిని దర్శించుకుంటే మోక్షం లభిస్తుందని భక్తుల విశ్వాసం. వాల్మీకి మహర్షి ఈ ప్రాంతంలో తపస్సు చేయడంతోనే ఈ గ్రామానికి వాల్మీకిపురం అన్న పేరు వచ్చిందని, శ్రీరామచంద్రుడు వాల్మీకం (పుట్ట)లో వెలిసినందున వాల్మీకిపురం అయిందన్న అభిప్రాయాలున్నాయి. ఈ నేపథ్యంలో ఇక్కడ వెలసిన పట్టాభిరాముడికి ఏటా నిర్వహించే బ్రహ్మోత్సవాలు ఈ నె 11వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి.

ఆలయ ప్రాశస్త్యమిదీ..

అన్నమయ్య జిల్లా, వాల్మీకిపురంలో వెలసిన శ్రీ పట్టాభిరామస్వామి దేవాలయం వెయ్యేళ్ల క్రితం నిర్మించినట్లు, 13వ శతాబ్దంలోనే ఈ పట్టాభిరామస్వామి దేవాలయాన్ని పునఃనిర్మాణము గావించినట్లు రికార్డులు తెలుపుచున్నాయి. 15వ శతాబ్దంలో శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుల వారు వాల్మీకిపురం క్షేత్రాన్ని సందర్శించి ఎన్నో కీర్తనలను రచించినారు. ఈ పట్టాభిరామాలయంలో గల మూల విగ్రహాలను మహర్షి జాంబవంతులు వారిచే ఒకేచోట ప్రతిష్ఠించడ



ప్రత్యేక అలంకరణలో పట్టాభిరామస్వామి సమేత సీతమ్మ, లక్ష్మయ్య స్వామి

మైనది. వాల్మీకిపురం పరిసర ప్రాంతంలోని శతశృంగ పర్వతాలలో వాల్మీకి మహర్షి తపస్సు చేసినారని, ఈ కారణంగా వాల్మీకిపురం క్షేత్రం పురాణ ప్రసిద్ధిగాంచినది. భారతదేశంలో 'అయోధ్య' తర్వాత శ్రీరామ క్షేత్రాలలో మొదటిస్థానం ''వాల్మీకిపురమే''. ఎంతో ఘనమైన చరిత్ర కల్గిన ఈ ఆలయానికి ఆనాటి రాజులు శ్రీకృష్ణదేవరాయులు, ఛత్రపతి శివాజీ, సాళువ నరశింగభూపతిరాయలవారు మరియు ఆంగ్లేయుల అధిపతులలో థామస్ మన్రో, సి.పి బ్రౌన్, హార్డ్‌హార్డింగ్ వంటి వారు, ముస్లీం నవాబులు శ్రీరాముని సేవించి తరించారని ప్రతీతి.

ఇలా చేరుకోవచ్చు

తిరుపతి నుంచి 90 కిలో మీటర్ల దూరంలో వాల్మీకిపురం శ్రీ పట్టాభిరామాలయం ఉంది. తిరుపతి–మదనపల్లి హైవే రోడ్డు పక్కన కలదు. తిరుపతి నుంచి ప్రతి 30 నిమిషాలకు బస్సు సౌకర్యం కలదు. అలాగే మదనపల్లి నుంచి 20 కిలో మీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది. మదనపల్లి నుంచి ప్రతి 15 నిమిషాలకు బస్సు సౌకర్యం కలదు.



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన పట్టాభిరామాలయం

▶▶ బ్రహ్మోత్సవాల వివరాలు..

- 11వ తేది గురువారం: బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ
- 12వ తేది శుక్రవారం: ఉదయం – ధ్వజారోహణము , రాత్రి – గజ వాహన సేవ
- 13వ తేది శనివారం: ఉదయం – ముత్యపుపందిరి వాహనము , రాత్రి – హనుమంత వాహనము
- 14వ తేది ఆదివారం: ఉదయం – కల్పవృక్ష వాహనము, రాత్రి – సింహవాహనము
- 15వ తేది సోమవారం: ఉదయం – సర్వభూపాల వాహనము, రాత్రి – పెద్ద శేష వాహనము
- 16వ తేది మంగళవారం: ఉదయం – సూర్యప్రభ వాహనము, సాయంత్రం – చంద్ర పభ వాహనము – రాత్రి మోహినీ అవతారము
- 17వ తేది బుధవారం: ఉదయం – తిరుచ్చి ఉత్సవము , రాత్రి – శ్రీ సీతా రాముల కల్యాణోత్సవం, గరుడ సేవ.
- 18వ తేది గురువారం: ఉదయం – రథోత్సవం, సాయంత్రం – ధూళి ఉత్సవం
- 19వ తేది శుక్రవారం: ఉదయం – తిరుచ్చి ఉత్సవము , రాత్రి – పార్వేట ఉత్సవం, అశ్వవాహనము.
- 20వ తేది శనివారం: ఉదయం – వసంతోత్సవము, చక్రస్నానం, రాత్రి – హంస వాహనము, ధ్వజావరోహణము.
- 21వ తేది ఆదివారం: ఉదయం – స్నపన తిరుమంజనం – సాయంత్రం – పుష్పయాగం, పుష్ప ప్రసాద వితరణ.

క్లుప్తంగా

ఆటో ఢీకొని వ్యక్తి మృతి

కలకడ : ఆటో ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆదివారం తెల్లవారుజామున కలకడ మండలం, కె.బాటవారిపల్లె పంచాయతీ కలకడ మాదిగపల్లె గ్రామానికి చెందిన లక్ష్మన్న (70) చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై నడిచి వెళుతుండగా వెనుక వైపునుంచి ఆటో ఢీకొంది. గాయపడిన లక్ష్మన్నను చికిత్స నిమిత్తం 108 వాహనంలో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రమాదానికి కారణమైన ఆటోను సీజ్‌చేసి, ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో వీఆర్‌ఓ మృతి

చిన్నమండెం : బోనమల వీఆర్‌ఓ నాగేశ్వరయ్య(52) గుండెపోటుతో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. చిన్నమండెం మండలం బోనమల గ్రామ రెవెన్యూ అధికారిగా నాగేశ్వరయ్య పనిచేస్తున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో స్వగృహంలో ఉన్న నాగేశ్వరయ్య ఉన్నట్లుండి ఛాతిలో నొప్పి వస్తోందన్నారు. బంధువులు హుటాహుటిన రాయచోటిలోని ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది నాగేశ్వరయ్య భౌతికకాయం వద్ద నివాళులు అర్పించారు.

వరిపొట్టు మాటున మద్యం రవాణా

- పక్కా సమాచారంతో పట్టుకున్న అధికారులు
- 240 మద్యం బాక్సులు, మినీలారీ సీజ్
- వాటి విలువ రూ.18.51 లక్షలు
- రవాణాదారులు టీడీపీ నేత 'పుట్టా' అనుచరులు



సెబ్ తనిఖీల్లో పట్టుబడిన అక్రమ మద్యం వివరాలను వెల్లడిస్తున్న సెబ్ అధికారులు

కర్నూలు : స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తనిఖీల్లో భారీగా అక్రమ మద్యం పట్టుబడింది. వరిపొట్టుమాటున తెలంగాణ నుంచి వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు ప్రాంతాలకు మద్యం రవాణా చేస్తున్నట్లు పక్కా సమాచారం అందడంతో కర్నూలు శివారులోని అంతర్ రాష్ట్ర సరిహద్దు పంచలింగాల చెక్‌పోస్టు వద్ద సెబ్ అధికారులు తనిఖీ చేసి రూ.14.51 లక్షలు విలువ చేసే 240 బాక్సుల మద్యం, రూ.4లక్షలు విలువ చేసే వాహనాన్ని సీజ్ చేశారు. హైదరాబాద్ నుంచి కర్నూలు వైపు వస్తున్న అశోక్ లైలాండ్ వాహనాన్ని విధుల్లో ఉన్న సిబ్బంది ఆపి తనిఖీ చేయగా అందులో వరిపొట్టు బస్తాలున్నాయని డ్రైవర్ చెప్పగా వాహనం అధిక బరువుతో కనిపించడంతో అనుమానం వచ్చి వరిపొట్టు మూటలను పరిశీలించారు. మద్యం వాసన రావడంతో వాహనాన్ని పక్కకు ఆపి బస్తాలను తొలగించి చూడగా అందులో మద్యం బాక్సులు బయటపడ్డాయి. వాహనంలో ఉన్న డ్రైవర్ పఠాన్‌సాదిక్, సహాయకుడు (క్లీనర్) షేక్ షఫీలను అదుపులోకి తీసుకుని విచారించగా వైఎస్సార్ జిల్లా మైదుకూరు, ప్రొద్దుటూరుకు మద్యాన్ని తీసుకుని వెళ్తున్నట్లు చెప్పారు. వీరు వైఎస్సార్ జిల్లా చాపాడు మండలం ఖాదర్‌పల్లె వాసులుగా గుర్తించారు. ఏఈఎస్ వినోద్‌కుమార్ నాయక్, కర్నూలు సీఐ రాజేంద్రప్రసాద్, కర్నూలు అర్బన్ తాలుకా ఎస్‌ఐ పీరయ్యతో కలిసి ఆదివారం సాయంత్రం కర్నూలు సెబ్ స్టేషన్‌లో సెబ్ జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్, విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు.

టెక్నికల్ సిబ్బందితో విచారణ..

పెద్దమొత్తంలో అక్రమ మద్యం లభించడంతో పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టెక్నికల్ టీమ్స్ రంగంలోకి దిగి విచారణ చేపట్టగా ఈ అక్రమ మద్యం పల్లవోలుకు చెందిన చింపర్తి రింగులబాషా అలియాస్ లాల్‌బాషా అనే వ్యక్తికి సంబంధించిందని తేలింది. ఒప్పందం ప్రకారం కందనూరు హబీబుల్లా అనే వ్యక్తికి చెందిన వాహనంలో తెలంగాణ రాష్ట్రం ఇటిక్యాల మండలం జింకలపల్లి గ్రామంలో ఉండే శ్రీనివాస వైన్స్ పేరుతో బిల్లు వేయించుకుని వనపర్తి ఐఎంఎల్ డిపోలో మద్యం లోడ్ చేసుకుని మైదుకూరు, ప్రొద్దుటూరుకు తరలిస్తున్నట్లు విచారణలో బయటపడింది.

మోస్ట్ వాంటెడ్ రింగుల బాషా..

మద్యం రవాణాలో ప్రధాన నిందితుడిగా అధికారులు అనుమానిస్తున్న చింపర్తి రింగులబాషా పైన గతంలో ఎర్రచందనం, మద్యం అక్రమ రవాణాకు సంబంధించిన 104 కేసులు ఉన్నట్లు విచారణలో బయటపడింది. వాహనం డ్రైవర్ పఠాన్‌సాదిక్, క్లీనర్ షేక్ షఫీది కూడా రింగులబాషా సొంత ఊరు కావడంతో వారికి దినసరి కూలీ ఇచ్చేలా ఒప్పందం చేసుకుని తెలంగాణ నుంచి వారి చేత రవాణా చేయిస్తున్నట్లు బయటపడింది. వాహన యజమాని హబీబుల్లాని కూడా ఇందులో నిందితునిగా చేర్చారు. మద్యం రవాణాదారుల్లో మొత్తం దాదాపు 20 మంది దాకా ఉన్నట్లు విచారణలో బయటపడింది. ఇందులో కొంతమంది టీటీడీ మాజీ చైర్మన్, మైదుకూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌కు ప్రధాన అనుచరులుగా ఉన్నట్లు బయటపడడంతో వైఎస్సార్ జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి చెందిన ఓ సీఐ స్థాయి అధికారి కర్నూలుకు వచ్చి పూర్తి స్థాయిలో విచారణ జరిపారు. రింగుల బాషా కొన్నేళ్లుగా మద్యం వ్యాపారం చేస్తూ సెబ్, సివిల్ పోలీసు అధికారులకు ఫోన్‌పే ద్వారా మామూళ్లు ముట్టజెప్పినట్లు విచారణలో ప్రాథమికంగా తేలింది. ఆ కోణంలో కూడా ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారి విచారణ చేశారు. గతంలో కర్నూలు జిల్లాలో పని చేసిన ఇద్దరు సెబ్ సీఐలు ఇటీవల వైఎస్సార్ జిల్లాకు బదిలీపై వెళ్లారు. వారి పాత్ర కూడా ఇందులో ఉన్నట్లు సమాచారం అందడంతో ఆ కోణంలో అధికారులు విచారణ జరుపుతున్నారు. ఈ కేసులో ప్రతిభ కనబరచిన చెక్‌పోస్టు సబ్ ఇన్‌స్పెక్టర్ పృథ్వీరాజ్, కర్నూలు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ మారుతి ప్రసాద్, తాలుకా పీఎస్ ఎస్‌ఐ పీరయ్య, సెబ్ ఇంటిలిజెన్స్ హెడ్ కానిస్టేబుల్ నరసింహులు, చెక్‌పోస్టు కానిస్టేబుళ్లు కె.నరసింహులు, చంద్రపాల్, మధుసూదన్‌రెడ్డి తదితరులను అభినందించి వారికి నగదు రివార్డులను అందజేశారు. కేసుకు సంబంధించి ఏఈఎస్, కర్నూలు సీఐ ఆధ్వర్యంలో రెండు టీమ్‌లు దర్యాప్తు కొనసాగిస్తున్నాయని సూపరింటెండెంట్ తెలిపారు.



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న సర్కారు బడుల రూపురేఖలు మార్చేశారు.. పేదలకు సొంతింటి కల సాకారం చేస్తున్నారు. సచివాలయాల ద్వారా క్షణాల్లో ప్రతి పని జరుగుతోంది. ఫలితంగా పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

నాడు–నేడుతో బడులకు కొత్తరూపు



గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేసి విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. ఓ వైపు పాఠశాలల్లో వసతులు, మరో వైపు విద్యార్థులకు విద్యా సామగ్రి సకాలంలో అందిస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో విద్య అందుతోంది. గతంలో ఎన్నడూ ఈ మార్పు చూడలేదు. కేవలం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాకే ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ చేకూరింది.

- ఎం. నాగలక్ష్మీ, కొత్తమాధవరం జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం, ఒంటిమిట్ట మండలం

ఇంటి వద్దకే ధ్రువీకరణ పత్రాలు



ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఇంటి వద్దకే మా పిల్లలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు వచ్చాయి. గతంలో ధ్రువీకరణ పత్రాలు కావాలంటే మండల కేంద్రానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. అవి ఎప్పుడు వస్తాయో కూడా తెలియని పరిస్థితి ఉండేది. ఇటీవల నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అవసరమైన ధ్రువీకరణ పత్రాలన్నీ సచివాలయం ద్వారానే వస్తాయని వలంటీర్ ప్రవీణ్ చెప్పడంతో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నాము. రెండు రోజుల వ్యవధిలోనే దరఖాస్తు చేసుకున్న ధ్రువీకరణ పత్రాలన్నీ ఉచితంగానే అందజేశారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలన్నీ కూడా వలంటీర్ ద్వారా ఇంటి వద్దకే అందిస్తున్నారు. మా పిల్లలకు అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన పథకాల ద్వారా మాకు లబ్ధి చేకూరింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మేము ఎప్పటికీ రుణపడి ఉంటాము.

- కనుమల వెంకటలక్షుమ్మ, కాలువపల్లె, గోపవరం మండలం

వెదురూరులో భారీ ఇఫ్తార్ విందు


వెదురూరులో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ వర్గీయులు


వెదురూరులో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నేతలు

హాజరైన ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

చాపాడు : మండల కేంద్రమైన చాపాడు నుంచి వెదురూరు వరకూ 11 కిలో మీటర్ల మేర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆదివారం సాయంత్రం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. మండలంలోని వెదురూరు గ్రామంలో 2వేల మందికి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా చాపాడు నుంచి వందలాది బైక్‌లలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు లక్షుమయ్య, వీరనారాయణరెడ్డి, జెడ్పీటీసీ రామగోవిందరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రామమోహన్ రెడ్డి, ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, పీవీ రమణారెడ్డి, రామాంజనేయులరెడ్డి, ఎల్లారెడ్డి, వీరారెడ్డి, నవనీశ్వర్‌రెడ్డి, కరీముల్లా, ఎంపీటీసీ శివ, జయరామిరెడ్డి, నారాయణరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, సీవీ సుబ్బారెడ్డి, సిద్దారెడ్డి, రమణారెడ్డి, రవిశంకర్‌రెడ్డి, జయరాజు, పుల్లయ్య, వెంకట్‌రెడ్డి, జయసుబ్బారెడ్డి, గంగులయ్య, విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, జి.దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

20 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక..

ఇఫ్తార్ విందు కార్యక్రమంలో భాగంగా వెదురూరు గ్రామంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని టీడీపీ వర్గీయులైన బొగ్గుల రెడ్డయ్యరెడ్డి, భూమాయపల్లె సుబ్బారెడ్డి, పాలగిరి రవిచంద్రరెడ్డి, చిన్నరెడ్డయ్యరెడ్డి, ఆంజనేయరెడ్డి, మల్లికార్జునరెడ్డి, రామమోహన్‌రెడ్డి, సుబ్బిరెడ్డి, మూల పెద్ద రెడ్డయ్యరెడ్డి, బయన్న, భాస్కర్ రెడ్డి, సుబ్బరామాచారి, సుబ్బారెడ్డిలతో పాటు టీడీపీకి చెందిన 20 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నాగిరెడ్డిలు పార్టీ కండువా వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు.

శాకంబరీ దేవి అలంకారంలో గంగమ్మ తల్లి

ముగిసిన వారాల గంగమ్మ జాతర


చింతకొమ్మదిన్నె : జిల్లాలో ప్రసిద్ధి గాంచిన చింతకొమ్మదిన్నె గంగమ్మ తల్లి ఆలయానికి వారాల జాతరలో భాగంగా నాల్గవ వారం భక్తులు అమ్మవారిని దర్శించడానికి అధిక సంఖ్యలో పోటెత్తారు, ఆలయ చైర్మన్ పి.బి విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు ఏర్పాట్లు చేశారు. అమ్మవారికి తెల్లవారుజామునే అభిషేకాలు నిర్వహించి, పట్టు వస్త్రాలతో అలంకరించి, ప్రత్యేకంగా తెప్పించిన పూలమాలలు, కూరగాయలతో అమ్మవారి శాకంబరీ దేవిగా అలంకరించారు. నాలుగు వారాల జాతరలో భాగంగా చివరి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సిఐ శంకర్ నాయక్ పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.

అమ్మవారి దర్శనం రూ.200

అమ్మవారి దర్శనం భలే ఖరీదైంది. ఆలయంలోని గంగమ్మ తల్లిని దర్శించుకోవాలంటే రూ.200 చెల్లించాల్సిందే. టెంకాయ రూ.50, టిక్కెట్ రూ.50 ఆలయంలో జంతు బలులు చేయాలంటే రూ. 100 చెల్లిస్తేనే అమ్మవారి దర్శనం కుదురుతుంది. ఆలయంలో టిక్కెట్‌ల ధరల కంటే జంతు బలులను చేసే సిబ్బందికి ఎక్కువ మొత్తంలో నగదు చెల్లించాల్సి వస్తోందని భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

టెంకాయల టెండరుదార్ల దోపిడీ..

ఆలయ ఆవరణంలో అత్యధిక ధరలతో టెంకాయలు విక్రయిస్తున్న టెండర్‌దారులను ఆలయ అధికారులు ధరలు తగ్గించమని హెచ్చరించినప్పటికీ వారిలో చలనం లేదు. మరిన్ని కౌంటర్లు పెంచి ఇష్టానుసారంగా జాకెట్లు, చీరలు, పసుపు కుంకమలు, ఒక్కొక్క దానికి ఒక్కో రేటు అధికంగా ఏర్పాటు చేసి భక్తుల వద్ద నుండి రాబడుతున్నారు. ఇదేమిటని భక్తులు ప్రశ్నిస్తే ఆలయానికి మేము టెండర్ వేశాము. ఆ సొమ్ము మొత్తం వసూలు కావాలంటే ఇలాంటి ధరలు ఉండాల్సిందేనని వారు భక్తులకు తేల్చిచెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు వీరిపై కఠిన చర్యలు తీసుకొని ధరలు భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.


శాకంబరీ దేవి అలంకరణలో దర్శనమిస్తున్న గంగమ్మ తల్లి

అగ్నిప్రమాదంలో మోటారు, పైపులు దగ్ధం

బి.కోడూరు : మండలంలోని గంగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి, పోలిరెడ్డి, మరో ఇద్దరు రైతులకు సంబంధించిన విద్యుత్ మోటార్లు, పైపులు అగ్నిప్రమాదానికి గురై కాలిపోయాయి. సగిలేరు నుంచి నీటిని పొలానికి అందించేందుకు పైపులు, మోటార్లను గతంలో రైతులు ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం సగిలేరులో నీరు లేకపోవడంతో పాటు సగిలేరు వెంబడి ఉన్న కంపచెట్లు, తుంగ ఎండుముఖం పట్టాయి. ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు ఎండు జమ్ముకు నిప్పు పెట్టడంతో సగిలేరు వెంబడి సుమారు కిలోమీటరు మేర ఇరువైపులా మంటలు చెలరేగాయి. మధ్యాహ్నం సమయం కావడంతో రైతులు ఈ విషయాన్ని గమనించలేదు. అటుగా వెళుతున్న వారు దట్టమైన పొగలు వస్తుండటాన్ని గమనించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి వెళ్లి చూసేసరికి మోటార్లు, పైపులు అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.1.50 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు. ప్రభుత్వం సాయం అందించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.


అగ్నిప్రమాదంలో కాలిపోయిన పైపులు


సగిలేరు వెంబడి మంటలు వ్యాపిస్తున్న దృశ్యం

యువకుడి ఆత్మహత్య

సిద్దవటం : మండలంలోని శ్రీ నిత్యపూజ స్వామి కోనకు వెళ్లే రహదారిలోని వనేశ్వరం సమీపంలో రంజిత్‌కుమార్(32) అనే యువకుడు విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్‌ఐ పెద్ద ఓబన్న తెలిపారు. సిద్దవటం ఎగువపేటకు చెందిన రాధాకృష్ణ రెండవ కుమారుడు రంజిత్‌కుమార్‌కు వివాహం కాలేదని మనస్తాపానికి గురయ్యేవాడు. శనివారం ఆత్మకూరు నుంచి సిద్దవటంలోని తన నివాసానికి వచ్చాడు. అదే రోజు మధ్యాహ్నం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఎంతసేపటికీ రాకపోవడంతో అతని స్నేహితులు, బంధువులు సిద్దవటం పోలీసులకు శనివారం రాత్రి ఫిర్యాదు చేశారు. ఆదివారం ఉదయం మృతుని సెల్ ఫోన్ ఆన్‌లో ఉండటంతో లోకేషన్ గుర్తించారు. ఈ మేరకు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

టీడీపీ నుంచి 150 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక


ఎంపీ అవినాష్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేతలు, చిత్రంలో సతీష్‌రెడ్డి, వైఎస్ కొండారెడ్డి


పార్టీలో చేరుతున్న వారికి కండువాలు కప్పుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా


వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

పార్టీలోకి ఆహ్వానించిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

చక్రాయపేట : మండలంలోని సుమారు 150 కుటుంబాలకు చెందిన తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు ఆదివారం మాజీ ఎమ్మెల్సీ సతీష్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. గడ్డంవారిపల్లెకు చెందిన ఎల్‌ఎన్ కృష్ణారెడ్డి, గంగిరెడ్డి, యోగాంజనేయుల రెడ్డి, ఎల్‌ఎన్ గంగిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఎల్‌ఎన్ జగదీశ్వర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, మీసాల గంగిరెడ్డి, రెడ్డెప్ప, బాలగంగడు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు బయారెడ్డి, మాజీ సర్పంచ్ జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి వైఎస్ కొండా రెడ్డిలు పార్టీ కండువాలు వేసి వారిని సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల సమన్వయకర్త బెల్లం ప్రవీణ్ కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ శివప్రసాదరెడ్డి, ఎంపీపీ మాధవీ బాలకృష్ణ, మండల యూత్ కన్వీనర్ రామాంజనేయరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రామాంజులరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు శేషారెడ్డి పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

టీడీపీ నుంచి 50 కుటుంబాలు..

కడప కార్పొరేషన్ : కడప నగరం 37వ డివిజన్ అగాడి వీధిలో టీడీపీ నుంచి 50 కుటుంబాలకు చెందిన వారు వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం రాత్రి ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై ఉన్న నమ్మకంతో అనేక మంది వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన కలయికను ప్రజలు విశ్వసించడం లేదని విమర్శించారు. ప్రస్తుత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అఖండ మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. పార్టీలో చేరిన వారిలో మైనార్టీ నాయకులు నూర్, అస్లం, అహ్మద్, సుభాని, ఖాజా, సాబ్జాన్, జిలాన్, మొహిద్దిన్ వారి మిత్రబృందం ఉన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు ఎస్. సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పి. జయచంద్రారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, రిజ్వాన్, రమేష్‌రెడ్డి, బాబా షర్ఫుద్దీన్, బసవరాజు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో 70 కుటుంబాలు..

జమ్మలమడుగు : నగర పంచాయతీ పరిధిలోని కన్నెలూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీలో 70 కుటుంబాలు చేరాయి. ఆదివారం రాత్రి కన్నెలూరు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడైన హృషికేశవరెడ్డి ఆధ్వర్యంలో బెల్లం కొండా దస్తగిరితో పాటు మరో 70 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ, పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, మార్పుల్ శ్రీను, చాంద్‌బాషా, రాష్ట్ర బీసీ నాయకుడు బడిగించల చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు రంజాన్ మాసం ప్రత్యేకం

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు: ముస్లింలకు రంజాన్ మాసం పవిత్రమైనదని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక ఆస్థాన యే గౌసియా దర్గాలో రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ బి.ఎస్ గౌస్‌లాజం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లింలకు అన్ని విధాలుగా వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందన్నారు. కౌన్సిలర్ ముల్లా జానీ తదితరులు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, సుధీర్‌రెడ్డిలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు పి. రామసుబ్బారెడ్డి, రమేష్ యాదవ్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కన్వీనర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి, ఆస్థాన యే గౌసియా పీఠాధిపతి సయ్యద్ షా గౌస్‌పీరా ఖాద్రీ, డాక్టర్ అగస్టిన్, పలువురు మత పెద్దలు పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, మత పెద్దలు

కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా ఉపవాసదీక్ష

కడప సెవెన్‌రోడ్స్ : ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్ అక్రమ అరెస్టుకు నిరసనగా ఆదివారం కడప నగరంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో నాయకులు ఒకరోజు ఉపవాస దీక్ష చేపట్టారు. ప్రతిపక్షాలను అణిచి వేయడంలో భాగంగా కేజ్రీవాల్‌పై అక్రమ కేసు నమోదు చేయడం అన్యాయమని ఆ పార్టీ జిల్లా కన్వీనర్ తిరుమలరెడ్డి ఈ సందర్భంగా విమర్శించారు. ఆయన క్షేమంగా కడిగిన ముత్యంలా బయటికి వస్తారని ధీమా వ్యక్తం చేశారు. విపక్షాలపై అక్రమ కేసులు నమోదు చేయడం బీజేపీకి పరిపాటిగా మారిందన్నారు. భవిష్యత్తులో కేజ్రీవాల్ భారత ప్రధాని అవుతారని భావించి ఆయన్ను అణిచి వేసేందుకు ఇలాంటి కేసులు బనాయిస్తున్నారన్నారు. కేజ్రీవాల్ ఏ తప్పు చేయనందువల్లే ప్రపంచ వ్యాప్తంగా ఆయనకు మద్దతు లభిస్తోందని తెలిపారు. ఆ పార్టీ పార్లమెంటు ఇన్‌చార్జి సాజిద్ మాట్లాడుతూ బీజేపీ నేతలకు, ఆ పార్టీతో జతకడుతున్న వారికి రానున్న ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దస్తగిరి, యూత్ వింగ్ అధ్యక్షుడు ఆరీఫ్, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు శశికుమార్ చౌదరి, జిల్లా లేబర్ వింగ్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, జిల్లా వలంటీర్ల విష్ణు, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.


ఉపవాస దీక్ష చేపట్టిన ఆప్ నాయకులు